27042025-MAI-09_Layout 1 4/27/2025 1:48 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

మన కాలపు తెలంగాణ మేధావి

నారదాసు లక్ష్మణ్‌రావు

కొన్ని చారిత్రక సందర్భాలకు కాలమే అంకురార్పణ చేస్తుంది. మానవ చరిత్రను మలుపు తిప్పిన అనేకమంది మహానుభావుల ఉద్భవం ఏదో ఒక కార్యకారణ సంబంధంతో ముడిపడి ఉంటుంది. అణచివేతల్లోంచి ఒక ఆశయం మొలకెత్తుతుంది. నిర్బంధానికి వ్యతిరేకంగా ఒక తిరుగుబాటు చెలరేగుతుంది. ఆర్థిక, సామాజిక, అసమానతలకు వ్యతిరేకంగా విప్లవాలే మొదలవుతాయి. బోయవాడు వాల్మీకిగా మారినా, సిద్ధార్థుడు బుద్ధుడిగా అవతరించినా, బలీయమైన ఒక సంఘటన తాలూకు భావ సంఘర్షణల్లోంచి పొందిన చైతన్యమే కారణం. తాను ప్రయాణించిన రైల్లోంచి బలవంతంగా తోసేసిన జాత్యహంకారాన్ని చవిచూసి ఉండకపోతే గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్యోద్యమానికి నడుం కట్టేవాడు కాదేమో! నందులచే పరాభవమే జరిగి ఉండకపోతే చాణుక్యుడు చంద్రగుప్తునిచే మగధ మహా సామ్రాజ్యాన్ని స్థాపించి ఉండకపోయేవాడేమో!

ఇలా ఏ పోరాటాలైనా, ఏ ఉద్యమ నేతలైనా కాలంచే సృష్టించబడి కాలాన్ని శాసించగలిగే స్థాయికి చేరుకోవడం చరిత్ర నిండా మనం చూస్తున్నాం. టీఆర్ఎస్ ఆవిర్భావం కానీ, కేసీఆర్ నాయకత్వాన్ని కానీ, అదే చారిత్రక దృష్టికోణంతో చూడవలసిన అవసరం ఉన్నది.

మానవజాతి చరిత్రలో జరిగిన విముక్తి పోరాటాలన్నింటికీ కారణాలు రెండే రెండు. ఒకటి అస్తిత్వ ఆకాంక్ష. రెండవది ఆత్మగౌరవ ఆకాంక్ష. అస్తిత్వ ఆకాంక్ష దేశాల స్వాతంత్ర్యోద్యమాలకు, జాతుల విముక్తి పోరాటాలకు, ప్రజల విప్లవోద్యమాలకు దారి తీస్తే, ఆత్మగౌరవ ఆకాంక్ష తెలంగాణ ఉద్యమానికి నాంది అయింది.

ఏపీ అవతరణలో దాగి ఉన్న కొన్ని కుట్రల కారణంగా, ఒకనాడు అన్ని హంగులతో స్వతంత్ర దేశంగా ఉన్న తెలంగాణ కాలక్రమేణా తన అస్తిత్వాన్నే కోల్పోయింది. తెలంగాణ ప్రాంతంలో అంతర్గత పరాయిపాలన కొనసాగింది. సొంత దేశంలో, అదీ ఒక స్వతంత్ర దేశంలో ఒక ప్రాంతం మరొక ప్రాంతం చేతిలో దోపిడీకి గురైంది. తెలుగు మాట్లాడేవారంతా ఒక రాష్ట్రంగా ఉమ్మడిగా జీవించాలన్న సాకుతో ఏకమై ఆ స్ఫూర్తినే మట్టిలో కలిపి తెలంగాణ భాషను, యాసను, సంస్కృతిని తెరమరుగు చేయడంలో ఒక పకడ్బందీ వ్యూహం కొనసాగి, సీమాంధ్రుల ఆధిపత్యంలో తాము పుట్టిన నేలపైనే కాందిశీకులుగా బతికే దుర్భర పరిస్థితి దాపురించింది తెలంగాణ ప్రజలకు. ఈ మోసాలను ప్రజలు తెలుసుకొనేలోగానే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. నీళ్లు, నిధులు, నియామకాలు కొల్లగొట్టబడినాయి. ప్రజల యాస, భాష, సంస్కృతులు అవహేళనకు గురైనాయి.

తెలంగాణ వేరు పడితే తప్ప మన వనరులపై పెత్తనం మనకు దక్కదని, వివక్ష ఆగదని, స్వయం పాలన సాధ్యం కాదన్న ఒక భావజాలవ్యాప్తి మరొక్కసారి తెలంగాణను సుడిగాలిలా చుట్టుముట్టింది. ఇందుకు కృషిచేసిన వాళ్లు తెలంగాణ ముద్దుబిడ్డలు, తెలంగాణ గత వైభవ చరిత్ర, సంస్కృతి పట్ల అవ్యాజమైన ప్రేమ కలిగిన కవులు, కళాకారులు, బుద్ధిజీవులు, ఉపాధ్యాయులు, పాత్రికేయులు, ప్రొఫెసర్లు, లెక్చరర్లు, విద్యార్థులు, ఉద్యోగులు, న్యాయవాదులు. ఇది తెలంగాణకు ఒక బౌద్ధిక ప్రపంచాన్ని సృష్టించింది. ఒక ఉద్యమ వేదికను తయారుచేసింది. కానీ, తెలంగాణకు స్పష్టమైన రాజకీయ పోరాటాన్నిచ్చింది, క్రియాశీల కార్యాచరణకు పురుడుపోసింది మాత్రం నిస్సందేహంగా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు @ కేసీఆరే. ఉద్యమ వ్యూహకర్త, తెలంగాణ నామస్మరణ తప్ప మరే వ్యాపకం లేని కేసీఆర్ అప్పటికి తనకున్న అలంకారప్రాయమైన, భుజకీర్తులుగా ఉన్న పదవులన్నింటినీ ఎడమకాలుతో తన్ని తెలంగాణ కదన రంగంలోకి దూకడం నిజంగా చరిత్రే!

సీత శోకం లంక దహనానికి దారితీసినట్టు, ద్రౌపది వస్త్రాపహరణమే కురుక్షేత్ర యుద్ధానికి నాంది అయినట్టు తెలంగాణ యాస, భాష, సంస్కృతుల అవమానమే తెలంగాణ ఉద్యమానికి కారణమైంది. ఆ అవమానం ఆత్మాభిమానాన్ని మేల్కొల్పింది. ఆత్మాభిమానం ఆలోచనను రేకెత్తించింది. ఆలోచన అన్వేషణకు దారితీసింది. అన్వేషణ మూలాలను అధ్యయనం చేయించింది. అధ్యయనం ఒక సిద్ధాంతాన్ని రూపొందించింది. సిద్ధాంతం ఒక కార్యాచరణకు పురుడుపోసింది. ఆ కార్యాచరణ తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమం. ఆ సిద్ధాంతం తెలంగాణ వాదం.

ఇన్ని కార్యకారక సిద్ధాంతాల కారణంగా కాలం ఒక గొప్ప పోరాటయోధున్ని కన్నది. చరిత్ర ఒక గొప్ప ఉద్యమ పార్టీ ఆవిర్భావానికి అంకురార్పణ చేసింది. ఆ పోరాటయోధుడు కేసీఆర్. ఆ ఉద్యమ పార్టీ టీఆర్ఎస్. కాలం గాయాలను మాన్పితే చరిత్ర గాయాలను కెలుకుతుంది. చరిత్ర కెలికిన ఆ గాయాల్లోంచి ఉద్యమ తరంగమై ఉద్భవించిన మహోద్యమ నాయకుడు కేసీఆర్.

తెలంగాణ అంతటా బౌద్ధిక భావజాల వ్యాప్తి జరిగిన తరుణంలోనే, ఎన్నో అంతర్మథనాలు, బాహిర్మేధోమథనాలు, ప్రణాళికలు, కార్యాచరణలు-పరిస్థితులను బేరీజు వేసుకున్న తర్వాతనే, 'తెలంగాణ ఉద్యమానికి అనుకూల పరిస్థితులు అనేకం ఉన్నాయి, వీటిని నడిపించే సామాజిక శక్తులు కావాలి. 'ఆ శక్తిని నేనైత' అని



తెలంగాణ ఉద్యమాన్ని తలకెత్తుకున్నారు కేసీఆర్. 2001, ఏప్రిల్ 27 నాడు టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారు.

తెలంగాణ అంటే తల కోసిచ్చే తత్త్వం, మడమ తిప్పని తెంపరితనం, తెలంగాణ గత, వర్తమాన, భవిష్యత్తు పట్ల ఒక చదువరికి, జ్ఞానికి ఉండే అవగాహన, ఆయన సొంతం! ఏ వాదననైనా గెలువగలిగిన వాగ్ధాటి, లక్షల జనాలను మంత్రముగ్ధులను చేయగలిగిన మాటల సమన్వయం, వాదన అత్యంత ప్రతిభావంతంగా ప్రవేశపెట్టి, వైరిపక్షాన్ని గెలవగలిగిన చాతుర్యత, రాజకీయ ఎత్తుగడల్లో ప్రజల భాగస్వామ్యం, అవసరమైన రాజకీయ సమీకరణాల పట్ల తెలివిడి, సామాజిక కోణాలను, వాటి మూలాలను ప్రతిభావంతంగా ఆవిష్కరించగలిగిన మన కాలపు తెలంగాణ మేధావి కేసీఆర్. అప్పటివరకు తాత్త్విక ప్రచారమే లక్ష్యంగా సాగిన కృషిని, రాజకీయ కృషిగా మలచడంలో ఆయన సఫలమయ్యారు. అందుకే నూటికి నూరు పాళ్లు తెలంగాణ ఎజెండానూ జాతీయ రాజకీయ యవనికపై శిఖరాగ్రాన ఆవిష్కరించగలిగారు కేసీఆర్.

బుద్ధి కుశలత, సైద్ధాంతిక అవగాహన, ఆలోచనల చురుకు, ఎత్తుగడల చాణక్యం, వాదనా పటిమ, శత్రువు బలాన్నీ, బలహీనతనూ సరిగ్గా ఎప్పటికప్పుడు అంచనా వేసి, గురి చూసి కొట్టగలిగిన ఆధునిక రాజకీయ ఎత్తుగడలు కేసీఆర్ సొంతం. 'తన బలమెంతో, బలహీనతెంతో సరిగ్గా బేరీజు వేసుకొని, అందుకనుగుణంగా నిర్ణయాలు తీసుకొనే వాడే గొప్ప బలవంతుడు' అన్న సూత్రాన్ని ఆచరణలో పెట్టిన గొప్ప ప్రాక్టికల్ విజ్‌డమ్ ఉన్న వ్యక్తి కేసీఆర్. అందుకే ఆయన ఉద్యమం ప్రారంభించిన అతి స్వల్ప వ్యవధిలోనే ఢిల్లీలో తెలంగాణ నగారా మోగించగలిగారు. ఎందరో రాజకీయ మిత్రులను కూడగట్టగలిగారు. ఆనాడు ఉద్యమం పతాక స్థాయికి చేరుకున్నదంటే దానికి ప్రేరకుడు కేసీఆర్. మాకు తెలంగాణయే ముఖ్యమని ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ, మంత్రి పదవులకూ, ఎమ్మెల్యే పదవులకూ రాజీనామాలు చేసినా, ఇవన్నీ కేసీఆర్ సాహస రాజకీయాలకు ప్రతీకలు. అవి సత్ఫలితాలనిచ్చాయి. ఆనాడు రాష్ట్రంలోని అన్ని పార్టీలకు తెలంగాణ తారకమంత్రంగా మారిన సందర్భం!

అధికారంలోకి వచ్చిన రెండు పర్యాయాల కాలంలో అభివృద్ధి, సంక్షేమంలో సాధించిన విప్లవాత్మక విజయాలు, విధ్వంసమైన తెలంగాణను విముక్తి వైపు పరుగులు తీయించాయి. పరాధీనత నుంచి స్వయంపాలన వైపు సాగిన సుదీర్ఘ పోరాటంలో టీఆర్ఎస్ పార్టీ పోషించిన గణనీయమైన పాత్ర చరిత్రలో నమోదైంది. సకల జనుల వికాసం, సాంకేతిక ప్రగతి, విద్య, ఆరోగ్యం, శాంతియుత సహజీవన వాతావరణం, రాజకీయ సుస్థిరత, వేగవంతమైన అభివృద్ధి, సంక్షేమం, వినూత్న ఆలోచనలు కలిగిన నాయకుడి విశ్రాంతి లేని శ్రమ ఫలితంగా సాధించుకున్న విజయాలు, శిథిలాల్లోంచి చిగురించిన చిరుమొలకల్లా ఆరంభమై, వటవృక్షమై తెలంగాణ అంతటా విస్తరించాయి. వీటిని పదికాలాల పాటు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తపై ఉన్నది.

ప్రజల్లో గందరగోళం సృష్టించి, పచ్చి అబద్ధాలను ప్రచారం చేసి, వాస్తవాలను వక్రీకరించి, కులాలు, మతాలు, వర్గాల పేరుతో చిచ్చుపెట్టి, అమాయక ప్రజలను రెచ్చగొట్టి, అధికార లాలసతో అసత్యాలపై ఆధారపడి, అభివృద్ధిని కూడా అడ్డుకోవడానికి అడ్డదారులు తొక్కి, ప్రజలను భ్రమల్లో ముంచి, ప్రజాపాలన పేరిట అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ పార్టీ. ఇలాంటి సందర్భంలో కేసీఆర్ విజన్‌ను, మేధో పరమైన పాలనను, త్యాగాన్ని, ఔన్నత్యాన్ని, పార్టీ విధానాలను, అమలుచేసిన పథకాలను, సాధించిన ప్రగతిని ఈ రజతోత్సవాల సందర్భంగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోయి, సరైన పద్ధతిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత, అవసరం ప్రతి ఒక్క టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తపై ఉన్నది. అప్పుడే టీఆర్ఎస్ సాధించిన తెలంగాణ రాష్ట్ర విజయాల సాఫల్యతకు, భవిష్యత్తులో వాటి కొనసాగింపునకు అవకాశం ఉంటుంది. రజతోత్సవ ఉత్సవాలకు సార్థకత చేకూరుతుంది.

(వ్యాసకర్త: టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ, కరీంనగర్)

బీఆర్ఎస్ రజతోత్సవ జోష్

ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ 25 ఏండ్ల ఆవిర్భావ పండుగకు సిద్ధమైంది. స్వరాష్ట్రం కలను సాకారం చేసి, తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన బీఆర్ఎస్.. చరిత్ర సమస్తం పోరాటాల మయమే. గులాబీ జెండాను, కేసీఆర్‌ను వేరుచేసి చూడలేం. 1969 ఉద్యమం అణగారిపోయిన తర్వాత తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించగల మరో నాయకుడు ఉద్భవించగలడా? అని జనం ఆశగా ఎదురు చూస్తున్న తరుణంలో గులాబీ జెండానుచేతబూని కేసీఆర్ బయల్దేరారు. చినుకుగా మొదలైన ఆ ఉద్యమ ప్రస్థానం అనతికాలంలోనే తుఫాన్‌గా మారింది.

2001, ఏప్రిల్ 27న తెలంగాణ జాతిని విముక్తం చేయడానికి కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించి, ఉద్యమంలో తొలి అడుగు వేశారు. అదే ఏడాది మే 17న కరీంనగర్ సింహగర్జన సభలో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి తీరుతానని కేసీఆర్ సుస్పష్టంగా చెప్పారు. ఆ లక్ష్యం నుంచి తప్పుకొంటే రాళ్లతో కొట్టాలని స్పష్టం చేశారు. రాజకీయ పక్షాల్లో ఎంతమంది నాయకులు అలా చెప్పగలరు? ఆ తెగువ, ఆత్మవిశ్వాసం, చిత్తశుద్ధే టీఆర్ఎస్‌ను ఇన్నేండ్లు నిలబెట్టాయి. కేసీఆర్ ఏం చేసినా తెలంగాణ కోణంలోనే చేస్తారు. ఏ సమస్య వచ్చినా బాధితుడి వైపు నుంచే ఆలోచిస్తారు. ఆయనను సన్నిహితంగా గమనిస్తే.. 'విజేతలు విభిన్న పనులేవీ చేయరు. అందరూ చేసే వాటినే విభిన్నంగా చేస్తారు' అన్న శివ్‌ఖేర్ మాటలు వాస్తవమనిపిస్తుంది. తెలంగాణ ఉద్యమ ప్రస్థానమూ అంతే. కేసీఆర్ భిన్నమైన పంథాను ఎన్నుకున్నారు. ఉద్యమాన్ని, రాజకీయాన్ని మేళవించారు. గతంలో జరిగిన అనేక రాష్ట్రాల ఆవిర్భావాలను లోతుగా అధ్యయనం చేశారు. ఒక్క నెత్తురు చుక్క చిందించకుండా రాష్ట్రం సాధించడం మాటలు కాదు. నిరసన తెలపాల్సి వస్తే శాంతియుత మార్గాన్నే ఎన్నుకున్నారు. తానే ఆమరణ దీక్షకు పూనుకొని శాంతియుతంగానే రాష్ట్రం సాధించారు. సడక్ బంద్, వంటావార్పు, సకల జనుల సమ్మె... ఇలా ఏ నిరసన చేసినా శాంతియుతమే.

'ఉద్యమ సూర్యుడా వందనం..
ఒక్క పిడికిలి బిగిస్తే.. బిగుసుకున్నయ్ కోట్ల పిడికిళ్లు
ఒక్క గొంతు జై కొడితే జంగు సైరనయ్యింది
స్ఫూర్తి ప్రదాతా వందనం.. ఉద్యమ సూర్యుడా వందనం'..

అంటూ తెలంగాణ ప్రజలు రజతోత్సవ సంబురాలకు సన్నద్ధమవుతున్నారు. 'తెలంగాణకు గుండె బలాన్నిచ్చిన జెండా.. గుండె గుండెను ఒకటి చేసిన జెండా.. ఉద్యమానికి ఊపిరి పోసిన జెండా, పేదవాడి ఆకలి తీర్చిన జెండా, రైతన్నకు భరోసా ఇచ్చిన జెండా.. తెలంగాణ ప్రజలకు అండాదండా మన గులాబీ జెండా..' అంటూ బీఆర్ఎస్ శ్రేణులు నినదిస్తున్నాయి.

- కోలేటి దామోదర్

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ పోలీసు హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్)

ఎల్దామా.. ఎల్కతుర్తికి

పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ప్రతి సందర్భంలో తెలంగాణ ఉద్యమానికి కార్యక్షేత్రం, ప్రేరణ క్షేత్రం ఓరుగల్లు పోరుగడ్డ. నాటి సాయుధ రైతాంగ పోరాటంలోనైనా, 1969 విద్యార్థి ఉద్యమంలోనైనా, నక్సలైట్ పోరాటంలోనైనా, ఆ తర్వాత ఉవ్వెత్తున్న ఎగిసిన మలిదశ ఉద్యమంలోనైనా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల భాగస్వామం లేకుండా ఒక్క పోరాటం సాగలేదు. షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, ఠాన్ నాయక్‌ల అమరత్వం నాడు సాయుధ పోరాటానికే కేంద్రం బిందువుగా నిలిచింది. ఆ తర్వాత కాళోజీ, సంగంరెడ్డి సత్యనారాయణ, ప్రొఫెసర్ బియ్యాల జనార్ధన్‌రావు, ప్రొఫెసర్ జయశంకర్ ప్రత్యేక రాష్ట్రం కోసం పడిన తపన అమోఘమైనది. వారి కృషిని తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువదు. ఇలా ఒకటా, రెండా ఎన్నో పోరాటాలకు ఓరుగల్లు వేదికైంది.

60 ఏండ్ల వివక్ష, అణచివేతకు పద్నాలుగేండ్ల పోరాటంతో కేసీఆర్ చరమగీతం పాడారు. ఈ క్రమంలో టీఆర్ఎస్ ఆవిర్భవించి, బీఆర్ఎస్‌గా రూపాంతరం జరిగిన ఈ 25 ఏండ్ల కాలంలో అనేక చారిత్రక ఘట్టాలకు కేసీఆర్ జీవం పోశారు. స్వరాష్ట్రం, స్వయంపాలన కోసం కేసీఆర్ చేపట్టిన పోరాటం సుదీర్ఘంగా సాగింది. గాంధీజీ అందించిన అహింసా నినాదం, అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కులకు అనుగుణంగా తెలంగాణ అమరుల స్ఫూర్తితో అనేక పోరాటాలు చేశారు. యావత్ తెలంగాణ సమాజం స్వరాష్ట్ర ఉద్యమంలో పాల్గొనేలా ప్రజలను కేసీఆర్ సమాయత్తం చేశారు. అందుకోసం అనేక రూపాల్లో ఉద్యమ పంథాను ఎంచుకున్నారు. నాటి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అజెండాలో తెలంగాణ అంశం పెట్టేలా ఒత్తిడి తేవడమే గాక, కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో తెలంగాణను ఏర్పాటు చేస్తామని హామీ ఇప్పించారు.

2004 నుంచి 2012 వరకు మహోన్నత పోరాటాన్ని తెలంగాణలో కేసీఆర్ ఆవిష్కరించారు. మొండికేసిన కాంగ్రెస్ ప్రభుత్వంతో తెలంగాణ రాష్ట్రంపై ప్రకటన చేయించేందుకు ప్రతి పల్లెను కదిలించారు. పదవులను త్యజించి కాంగ్రెస్‌కు సవాల్ విసిరారు. జేఏసీని ఏర్పాటు చేయించి, అన్ని రాజకీయ పార్టీలు ఉద్యమంలోకి వచ్చేలా చేశారు. రాస్తారోకోలు, రైలురోకోలు, వంటావార్పులు, నిరసనలు, ధర్నాలు, పెన్ డౌన్, సమ్మెలను నిత్యకృత్యం చేశారు. ఉద్యోగ, నిరుద్యోగులతో మహోన్నత ఉద్యమాన్ని నిర్మించారు. కేంద్ర సర్కార్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు. కేసీఆర్ అవిశ్రాంత పోరాటం, నిశ్చలమైన నాయకత్వంతో 60 ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నిజమైంది. స్వరాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది.

ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో ప్రభుత్వ ఫలాలు ప్రతి వర్గానికి అందాలంటే అద్భుత పథకాల సృష్టి జరగాలి. పథకాల రూపకల్పనతోపాటు వాటిని నిజాయితీగా, నిబద్ధతతో అమలుచేయగల నాయకుడు కావాలి. ప్రజల అవసరాలు, ఆకాంక్షలు తెలిసిన నాయకుడు కేసీఆర్. అటువంటి ఉన్నత ఆలోచనలు కలిగిన వ్యక్తి కాబట్టే.. దేశం గర్వించదగిన పథకాలకు కేసీఆర్ ప్రాణం పోశారు. అంతేకాదు, ఆ పథకాలను కూడా ఒక ఉద్యమంలా అమలుచేశారు. తెలంగాణ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పోరాట పంథాలో పాలన సాగించారు. ఆ యజ్ఞంలో భాగంగా రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్తు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలు దేశంలో ఆదర్శంగా నిలిచిపోయాయి. అనేక రాష్ట్రాలు తెలంగాణ పథకాలను అమలు చేశాయి.

ఇవాళ తెలంగాణ ఒక విపత్కర పరిస్థితుల్లో ఉంది. పోరాటాలు, త్యాగాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో మళ్లీ దోపిడీ నిత్యకృత్యంగా మారింది. దేశానికి దిక్సూచిగా నిలిచిన తెలంగాణలో నేడు అరాచక పాలన సాగుతున్నది. రైతుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా, మహిళలకు రక్షణ ఇవ్వలేక, విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం చేయలేక, ఉద్యోగులకు భరోసా ఇవ్వలేక, కార్మికులకు అండగా ఉండలేక అచేతనమై కాంగ్రెస్ సర్కార్ పాలన అందిస్తున్నది. ఈ నేపథ్యంలో ఒక నిశ్చలమైన, నికార్సైన, తెలంగాణ సమాజం పట్ల సోయి ఉన్న నాయకత్వాన్ని నేడు ప్రజలు కోరుకుంటున్నారు. అందుకు కేసీఆర్‌కు మద్దతుగా నిలిచేందుకు ఎల్కతుర్తికి జనహోరై కదులుతున్నారు. 33 జిల్లాల నుంచి ఓరుగల్లు సభకు హారెత్తి రావాలని పిలుపునిస్తున్నాం. తెలంగాణ హక్కులను కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి రక్షించుకోవడానికి ఎల్కతుర్తి వైపు జన జాతరై కదలండి! కేసీఆర్ నాయకత్వానికి బలమై నిలవండి! తెలంగాణను కాపాడుకోండి!

(వ్యాసకర్త: శాసనసభ్యులు, జనగామ)

తెలంగాణ అంటేనే పోరుగడ్డ. తెలంగాణ అంటేనే ఉద్యమాలకు చిరునామా.. పోరాటాలకు కేరాఫ్ అడ్రస్. ఉమ్మడి ఏపీలో ఐదు దశాబ్దాలకుపైగా జరిగిన అన్యాయంపై కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దశాబ్దంన్నరపాటు సుదీర్ఘ పోరు సలిపింది. నడిసంద్రంలో చిక్కుకున్న నావలా... గమ్యం తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్న తెలంగాణను దరికి చేర్చేందుకు కేసీఆర్ ఎంచుకున్న ఉద్యమ పంథా మహాసభలు. ఒక్కసిరా చుక్క లక్ష మెదళ్లను కదిలించినట్టు.. ఉద్యమ సారథి కేసీఆర్ నిర్వహించిన ఒక్కో సభ లక్షలాది మందిని ఏకం చేసింది. మూడున్నర కోట్ల మందిని ఆశయ సాధన దిశగా నడిపించింది. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసింది. సభలు నిర్వహించి, విజయవంతం చేయడం ఒక ఆర్ట్ అయితే, కేసీఆర్‌ను మించిన ఆర్టిస్ట్ ఎవరుంటారు. అందులో పేటెంట్ గనుక ఇవ్వాల్సి వస్తే ఆయనకు గాక మరెవరికి ఇస్తారు.

ఓరుగల్లులో పోరుసభ

గంగుల కమలాకర్

తెలంగాణ రాష్ట్ర కాంక్షను రగిలించేందుకు, తెలంగాణవాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కేసీఆర్ ఎంచుకున్న అస్త్రం మహాసభలు. తెలంగాణ సాధనే ఏకైక లక్ష్యంగా టీఆర్ఎస్‌ను స్థాపించిన కేసీఆర్ నాటి నుంచి గమ్యాన్ని చేరేవరకు అనేక సభలు నిర్వహించారు. అందులో కొన్ని సభలు తెలంగాణ ఈతి బాధల్ని చాటిచెప్పగా.. మరికొన్ని సభలు తెలంగాణ గతిని మార్చాయి. 2001 ఏప్రిల్ 27న టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం తర్వాత.. 20 రోజులకే కరీంనగర్ వేదికగా మొదటి బహిరంగ సభ జరిగింది. 2001 మే 17న జరిగిన సింహగర్జన వేదికగా కేసీఆర్ సింహనాదం చేశారు. ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. తెలంగాణవాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సభ ఎంతగానో దోహదపడింది.

ఆ తర్వాత పోరాటాల గడ్డ వరంగల్‌ను కేసీఆర్ తన సభలకు అడ్డాగా మార్చుకున్నారు. మహోజ్వల ఉద్యమంలో ఓరుగల్లు కేసీఆర్ వెన్నంటే ఉన్నది. ఉద్యమంలో ఎన్నో కీలక ఘట్టాలకు వేదికైంది. కేసీఆర్ అడుగులో అడుగై, ఆయన పిలుపిస్తే చాలు ఓరుగల్లు ప్రభంజనమైంది. కరీంనగర్ సభ జరిగిన నెలన్నరకే వరంగల్‌లో కేసీఆర్ మరో సభ నిర్వహించారు. ఈ సభతో తెలంగాణ ఆకాంక్ష గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించింది. కేసీఆర్ ప్రసంగాలకు ఫిదా అయిన యువత, తెలంగాణ ప్రజానీకం స్వచ్ఛందంగా ఉద్యమ జెండా ఎత్తుకున్నారు. ఈ సభ తర్వాత వెనువెంటనే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ 85 జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకున్నది. రెండు జడ్పీలపై గులాబీ జెండా ఎగరేసిందంటేనే ఈ సభ ప్రభావం ఎంతగా ఉందో ఊహించుకోవచ్చు. ఆ తర్వాత 2003లో వరంగల్‌లో జరిగిన తెలంగాణ జైత్రయాత్ర సభ టీఆర్ఎస్ సత్తా ఏంటో మరోసారి చాటిచెప్పింది. ఈ సభ తర్వాత కాంగ్రెస్ పార్టీ టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాల్సిన అనివార్యత ఏర్పడింది. మరుసటి ఏడాది 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఇటు తెలంగాణలో, అటు కేంద్రంలో అధికారంలోకి రావడానికి ఈ సభ దోహదం చేసింది. టీఆర్ఎస్ అండతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తన వక్రబుద్ధిని మరోసారి బయటపెట్టింది. తెలంగాణ వాదం లేదని నిరూపించేందుకు కాంగ్రెస్ కుటిలయత్నం చేసింది. దీంతో తెలంగాణవాదానికి అగ్నిపరీక్ష ఎదురైంది. అలాంటి విపత్కర సమయంలో 2007లో వరంగల్ వేదికగా జరిగిన తెలంగాణ విశ్వరూప సభ సరికొత్త చరిత్ర సృష్టించింది. తెలంగాణవాదం ఎన్నటికీ అమ్ముడుపోదని లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు ఎలుగెత్తి ప్రపంచానికి చాటారు. 2010లో కాకతీయ విశ్వవిద్యాలయం వేదికగా జరిగిన కాకతీయ విద్యార్థి పోలికేక సభ యావత్ విద్యార్థి లోకాన్ని ఉద్యమం దిశగా కార్యోన్ముఖులను చేసింది. ఆ తర్వాత మరో కీలక ఘట్టానికి ఓరుగల్లు వేదికగా నిలిచింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించి, వెంటనే యూటర్న్ తీసుకున్న కేంద్రానికి తెలంగాణ సత్తా చాటేందుకు మరోసారి ఓరుగల్లుకు అవకాశం దక్కింది. 2010 డిసెంబర్ 16న వరంగల్ వేదికగా జరిగిన తెలంగాణ మహాగర్జన సభ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. లక్షలాదిమంది 'జై తెలంగాణ' నినాదాలకు వేదికైన ఈ సభ గిన్నిస్ బుక్ రికార్డుల్లోనూ ఎక్కింది. అంతకుముందు అదే ఏడాది రాల్లెత్తిన మానుకోట ఉద్యమానికి ఊపిరులూదింది. ఇలా వరంగల్ వేదికగా జరిగిన ప్రతీ సభ, ప్రతీ ఘటన తెలంగాణ ఉద్యమ చరిత్రలో అపురూపమనే చెప్పాలి. తెలంగాణ మలిదశ ఉద్యమంలో జరిగిన అనేక కీలక ఘట్టాలకు ఓరుగల్లు ఆయువుపట్టుగా నిలిచింది. ఇక్కడ జరిగిన ఒక్కో సభ ఉద్యమ చరిత్రలో ఒక్కో మహోజ్వల ఘట్టమని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇప్పుడు మరోసారి బీఆర్ఎస్ రజతోత్సవం రూపంలో ఓరుగల్లు మరో పోరు సభకు వేదిక కానున్నది.

60 ఏండ్ల పోరాటం, ఆత్మబలిదానాలతో సాధించుకున్న తెలంగాణ నేడు మళ్లీ బలి దేవత చేతుల్లోకి వెళ్లిపోయింది. కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేసిన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తమ బతుకులు మరింత బాగుపడాలని ఆశించిన రైతన్నలకు బతుకే లేకుండాపోయింది. రోజుకో రైతు చొప్పున కాంగ్రెస్ సర్కార్ దాష్టీకానికి బలవుతున్నారు. హక్కుల కోసం నినదిస్తున్న విద్యార్థులపై లాఠీలు విరుగుతున్నాయి. చేసేందుకు పనుల్లేక, చేతిలో చిల్లిగవ్వ లేక ప్రజలు పస్తులు ఉంటున్నారు. గ్రామాలు అరిగోస పడుతున్నాయి. అభివృద్ధి కుంటుపడింది. సంక్షేమానికి సడుగులిరిగాయి. హైడ్రా, మూసీ ప్రాజెక్టు పేరిట ఇండ్లు కోల్పోయిన పేదల ఆక్రందనలు, హెచ్‌సీయూలో కాంగ్రెస్ సర్కారు చేసిన విధ్వంసంతో గూళ్లు కోల్పోయి, జేసీబీల కింద నలిగిన మూగజీవాల అరణ్య రోదనలతో రాష్ట్రం రావణకాష్ఠాన్ని తలపిస్తున్నది.

రేవంత్‌రె